సిగ్గు తెరలు

సీత పెళ్ళి పెడాకులూ చేసుకుంటుందా? చేసుకున్నా - ఆ మొగుడితో కాపురం చేస్తుందా? అనుకున్న వాళ్ళంతా 'సీతకు పెళ్ళిట' అని వినగానే ఆశ్చర్యంతో కొశ్చన్ మార్కుల్లా వుండిపోయారు

'దీనికోసం పూజచేసిన మహానుభావుడెవడో? అని వెటకారమూ చేశారు.

సీత చిన్నప్పటినుండి ఎవరినీ ఖాతరు చేసేదికాదు. చక్కగా ముద్దుగా, బుద్ధిగా, అణకువగా ఆడపిల్లలా వుండడం ఎవరూ చూడలేదు. మొగాడికి మొగుడిలా వుండేది, చెట్లెక్కడం, బిళ్ళా కర్రా ఆడడం, మగపిల్లలతో కలియబడి జట్టిలాడుతుండడం- చెప్పి చెప్పి తల్లిదండ్రులు విసిగి ఇక దండం పెట్టి వూరుకున్నారు.

స్కూలుకి వెళుతున్నపుడు బాయ్స్‌దగ్గర గర్ల్స్, ఇంట్లోనూ పైనా ఆడవాళ్ళు మగవాళ్ళకి భయపడుతున్నట్టు వాళ్ళేమన్నా ఏదో తప్పు చేసినట్టు ఏమీ అనకుండా తలవంచుకు వూరుకోవడం ఇలాటివి ఆమెకినచ్చేవి కాదు! ఎవరయినా ఏమైనా అంటే అక్కడే నిలబెట్టి నాలుగూ దులిపేది. ముఖ్యంగా మగవాళ్ళనుచూసి సిగ్గుపడిపోయి ముడుచుకు పోవడం అంటే సుతారామూ కిట్టేదికాదు 'మనకన్నా వాళ్ళేం ఎక్కువ' అనేది.

పెద్దయి తనలో మార్పువచ్చాక తను ఒకసారి వారివయిపు చూస్తే చాలు తరించిపోతాం అన్నట్టు, మాటాడితేచాలు దాసోహం అన్నట్టు, కొంగుతగిలితే చాలు మోక్షం లభించినట్లు ప్రవర్తించే ఈ మగపిల్లల

చేష్టలుచూసి ఆమెకు ఒకవిధమైన గర్వం, అహంభావం. వాళ్ళవయిప్పు చూసీ చూడనట్టుచూసి, నవ్వీ నవ్వనట్టు నటికచి వాళ్ళను ఏడిపించడం సరదాగా వుండేది! ఆమె ఎవరికీ అర్థంగాక గింజుకొనేవారు

'ఒక ఇంటర్వ్యూలా మగపిల్లలు పెళ్ళిచూపులకి రావడం, వాళ్ళ ముందు ఆఫీసర్ల ముందు నౌఖర్లలా నిలబడి అడిగిన వాటికి జవాబు చెప్పటం ఏమిటి? మనమే అలావెళ్ళి వాళ్ళను ప్రశ్నిస్తే ఎలాగుంటుంది? పోనీ నచ్చిన తర్వాత, డబ్బిచ్చి వాళ్ళు తీసుకువెళ్ళాలిగాని తిరిగి మనం కట్నం ఇవ్వడమేమిటి? మాగొప్ప మనల్ని ఉద్ధరిస్తారని' అని అనేది.

కానీ సీతకూడా కలలు కంటుందని ఆ కలలు ఎవరికీ అర్థం కానంత మాత్రంలో మొహమాటం కపటంలేని ఆమె హృదయం, మనసూ వెనక ఏం రూపకల్పనలు చేసుకుంటూందో ఎవరికి తెలుసు?

ఏదయినా పండేరోజు వస్తుంది!

అలాగే సీత కలలుకూడా పండేరోజు వచ్చింది. తీయని వూహలతో రుచి చూడబోయే అనుభవాన్ని తలుచుకుంటూ పరధ్యాన్నంగా వుంది.

వుండదూ మరి! ఈరోజుల్లో పాతికేళ్ళు వచ్చాక పెళ్ళి చేయడమే వేగిరం చేయడం! మరి పూర్వంరోజుల్లో నయితే ఇవతల శోభనానికి ముస్తాబుచేసివస్తే అవతల ఆపిల్ల వెళ్ళి ప్రక్కింటి అమ్మాయిలతో బొమ్మల పెళ్ళిళ్ళాట ఆడుకుంటూ వుండేదట! పాతికేళ్ళు వచ్చేసరికి నలుగురు పిల్లల అనుభవంతో స్త్రీలా మారిపోయేది.

బొత్తిగా అంత చిన్నతనంలో చేయడం చెడే అయినా...స్త్రీ జీవితంలో 'స్వర్ణయుగం' లాటి 'టీన్ఏజ్' అంతా అడవిగాచిన వెన్నెలలా వృథాచేయడం ఈ రోజుల్లో అంత మంచి పని మాత్రం కాదు అనుభవించవలసిన రోజులు, రాత్రుళ్ళు నిద్రలో స్వప్నాలలోనే గడిపేస్తే ఇంకేముంది?

స్నేహితులువచ్చి పరిహాసం చేస్తే సిగ్గుతో 'పొండి మరీను' 'మహా అవుతుంది పెళ్ళి' అనాల్సిన సారి పెళ్ళికూతురు—సీత -కమలా, శారదా, వచ్చి పరిహాసం చేసేసరికి గంభీరంగా.

'నా కలలు చెరిగి పోనివ్వకండి! నన్ను డిస్టర్బ్ చేయవద్దు.' అన్నట్టు నవ్వింది.

ఇరుగుపొరుగు అమ్మలక్కలు, వుండి వుండి వచ్చి పలకరిస్తూ వుంటే— 'ఈ అమ్మలక్కల గొడవేమిటి మధ్య! పానకంలో పుడకల్లా' అని విసుక్కుంది.

సాయంత్రం నాలుగంటలకల్లా లెమ్మన్నారు సీతని—స్నానం చేయించి తెల్లచీర కట్టించి కూర్చోబెట్టేరు!

అంతవరకూ బాగానే వుంది.

పిన్ని సుభద్ర గంపలో గంపెడుపూలు: చేమంతి, గులాబి, దవనం, మరువం ఇలా అన్ని రకాలూ వున్నాయి. అందులో... మొగలి పూవుల రేకుల్ని కత్తిరించి తయారుచేసి వుంచింది.

'రావే సీతా' అంటూ కూర్చోబెట్టి ఒక గంటన్నర కదలకుండా ముస్తాబు పూర్తి చేసింది....ఏదో నాజూకుగా, ఒకటో రెండో పువ్వులు పెట్టుకోవాలిగాని...ఏంవిటీ రొద్దఅంతా! జడ బరువుకి మెడలు లాగేస్తున్నాయి బాబూ!' అని అనేసరికి—

"నీకేం తెలుసే రతీదేవిలా వున్నావు ఇప్పుడు తెలుసా?" అంటూ జానకి వచ్చి ముద్దు పెట్టుకున్నంత పనిచేసింది. అదే సమయానికి సీత జడని ముందుకు విసిరింది...జానకి 'అమ్మయ్యో' అంటూ 'కప్పిలా తగిలిందే! నీ జడ బంగారంగానూ!' అంది నవ్వుతూ...

'మోటు సరసం చేస్తే మరేమవుతుంది!'

"సత్యభామ జడలా...అందుకే పూర్వం ప్రియులని జడతోనే కొట్టేవారట ప్రణయ కలహాల...లో..."

అంటూ కళ్యాణం బొట్టు పెట్టి...బుగ్గ చుక్క పెట్టింది వదిన గారు...నవ్వుతూ...

"అయినా ఏమిటిది? వేషం కట్టి పెట్టు" అని విసుక్కుంది సీత.

అందరూ కలిసి మొత్తంమీద సీతని శృంగారానికి, సింగారంచేసి బంగారు బొమ్మలా చేశారు. గనుస్తూనే చేయించుకుంది. ఈ నాటి సారి పెళ్ళికూతురు సీత ప్రతిపనినీ విమర్శిస్తూ.

ఎంత రెండుజడల సీత అయినా ఒంటి జడ వేసుకుని ఆ క్షణం దగ్గరవుతున్నకొద్దీ భారంగా నిట్టూర్చడం, భయంగా గుండె కొట్టుకోడం చేత కళ్ళు మూసుకోడం మొదలెట్టికది. ఏదో చెప్పలేని సంతోషం ఆనందం వళ్ళు పులకలెత్తించే ఆలోచనలూ వీటివలన సిగ్గు దానంతటదేముంచు కొస్తూంది. ఎంత ధైర్యంగా మామూలుగా వుందామని ప్రయత్నించినా నలుగుర్నీ మొహం ఎత్తి చూడలేకుండా వుంది.

"అందరికీ తెలిసినట్టు ఎందుకో ఈ తంతూ, ఆర్భాటమూ, పెద్ద ఎడ్వర్టయిజ్‌మెంటులాగ" అని అనుకుంది.

"పెళ్ళి ఎలాగూ అందరిముందూ చేశారుగా...ఇంక ఆ దంపతుల కర్మానికి వారిని వదిలేయకూడదూ. వాళ్ళే వీలు చూసుకోరూ? నలుగురి ముందూ—ఎందుకో—ఏమిటో ఈ ఆచారం...ఛీ..." అనిమూడాలను కుంది. గాని—పైకి అనే ధైర్యం చాలింది కాదు...

"ఇంతకీ ఆయన ఇన్నిటికీ ఎలా ఒప్పుకున్నారో అతనే ఏమీ అననిది తనకేమీ? ఎలా అనగలదు?" అని ఆలోచించింది.

అవతల గదిలో వదినగారూ, అక్కయ్యలూ, కిలాకిలా నవ్వుతూ గది అలంక రిస్తున్నారు. సీతకోసం! సీత ఆనందం కోసం...సీత మొదటిరాత్రి కోసం!

స్నేహితురాలు జానకి నవ్వుతూ గబగబా వచ్చి సీత రెక్కపుచ్చు కుని తీసుకువెళ్ళి గదిలో నిలబెట్టింది.

"ఏమే తర్వాత మమ్మల్నినేవు! ఇప్పుడే చూసుకో...ఎలా వుంది గది?" అని ఎగతాళి చేసింది పగలబడి నవ్వుతూ.

"ఛీఛో నీలాగేం కాదు!" అని అంటూ సీత ఏడ్చినంత పనిచేసి అక్కణ్నుండి తుర్రుమంటుందనుకున్న వాళ్ళందరు –

సీత గదంతా కలయజూసి... 'సినియాలో చూసినట్టూఅచ్చంగా వుంది కిటికీకి దగ్గరా...గది గుమ్మానికి ఎదురూ...మరీ పాతకాలం పద్ధతి! ఆ మంచం ఈ గోడ వయిపు' అని తన అభిప్రాయం కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేసరికి అశ్చర్యపోయి...మారు మాటాడలేక పోయినారు–

జానకి మాత్రం! 'కావాలనే వేస్తే' అని నాలిక్కొరుక్కుంది.

"ఎట్లా తోస్తాయో!" అని ఈసడించుకుంది కోపం కనబరుస్తూ.

రాత్రి తొమ్మిది గంటలనుండి సీతని, ఆమెభర్తనీ కుర్చీల్లో కూచోబెట్టి...సీత అనుకున్న అర్థంలో—నానా యాతనా పెట్టారు. అందరూ ఆడవాళ్ళే! ఆ హాస్యాలకూ సరసాలకూ అంతులేదు. గంధాలు పూయించీ, సెంట్లు పూయించీ, పేర్లు చెప్పించీ, నవ్వించీ చేసిందేచేయించీ సంతోషిస్తున్నారు.

అది సిగ్గో, కోపమో, తెలియలేదుగాని, అన్నిటికీ మనసులో ఏమనుకున్నా...ఎదిరించి చెప్పే ధైర్యంలేక సీత అన్నిటికీ వూరుకుని అట్లాగే బలవంతాన్ని చేస్తూనే వుంది. పెళ్ళికొడుకు మాత్రం పాత పెళ్ళి కొడుకుల్లానే చేస్తున్నాడు.

ఎంత అయినా వాళ్ళకి సరదా తీరడం లేదు—ఈ ఆడవాళ్ళకి పెళ్ళితోనే సిగ్గుపోతుందా అనిపిస్తుంది. మామ్మూలు రోజుల్లో ఎంతఎరగ నట్లు, నోరు లేనట్టూ వుంటారో శుభకార్యాలు ఏమయినా వస్తేచాలు అంత ముందడుగు వేస్తారు! వాళ్ళ మాటలకు అంతే వుండదు! చేష్టలకు మితి వుండదు! నవ్వులకు అడ్డే వుండదు.

ఇట్లాటప్పుడే...ఆ కథా కార్యం చూడ్డానికి వచ్చిన భార్యా భర్తల మధ్య చిటపటలు చూస్తూంటాం—ఆవిడగారు కొంచం హుషారుగా నవ్వుతూ, అందరిలోనూ హాస్యాలాడుతూ తిరుగుతుండే సరికి చాలు ఇవ

తల మగవాడికి వళ్ళు మండిపోతూ వుంటుంది. తను ఎంతమందితో హాస్యాలాడినా, సరసాలాడినా, తనభార్యా ఏమనుకుంటుందోనని అయినా లెక్క చేయడు!...అలాంటిది-తన భార్యా కొంచం కలివిడిగా వుంటే చాలు సహించలేడు!

ఆ ఘడియ రానే వచ్చింది... సీతని అందరూ పట్టుకుని—గదిలోకి నెట్టేరు! స్ప్రింగులా వీళ్ళలోకే వచ్చేస్తుందనుకున్నారు కామోసు కానిసీత అలాంటిదేం చేయలేదు. 'ఎంత వేగిరం వదిలి పోతారా కాస్త వూపిరి పీల్చుకుందామా!' అని అనుకుందో ఏమో! అడుగులు వెయ్యనట్టే వేసి గదిలోకి వెళ్ళింది...తలుపులు మూసుకున్నాయి. ఆ వెనకాలే-తలుపు దగ్గర—గుసగుసలూ, కిసకిసలూ-సీతకు మనసు చచ్చిపోయినట్టు అవ లేదుగాని, అసహ్యం వేసింది.

తలుపుకి వున్న కర్టెన్ దించేసి ఇటువయిపు క్రీగంట తననే చూస్తున్న భర్తని చూసేసరికి సిగ్గు ముంచుకొచ్చింది. తనకు తెలియ కుండానే ఆ తలుపు దగ్గరే తలవంచుకు వుండిపోయింది. అంతవరకూ తనవాళ్ళు, వదిన, అక్కయ్యలూ, స్నేహితులూ, ముత్తయిదువులూ అందరూ తీసుకువచ్చారు. ఇంక ఎవరు తీసుకు వెళతారు? స్వర్గానికి చేరుకుందికి ఎన్నోదార్లు వున్నాయి. ఎంతోమంది ఎన్నోదార్లు చూపె డతారు. అంతా స్వర్గ ద్వారం వరకే. ఇంక అందులో ప్రవేశించడానికి ఎవరో ఎందుకు? ఆ స్వర్గం తనదే అయినపుడూ, తనకోసమే అయిన ప్పుడూ?...గాని ఏమో! ఎందుకో ఆ బెరుకు? అడుగు ముందుకు వెయ్య లేకపోతోంది? ఎవరూ లేరుగా? తనూ, అతనేగా...ఎందుకింక ఈ భయం? తన ప్రవర్తనకి తనకే నవ్వొస్తూంది? ఇలాంటి సమయాల్లో ఎలా వుండాలో ఎన్నిసార్లు ఆలోచించుకున్నది? ఈ సిగ్గూ, బిడియాలూ ఈ పాతకాలపు సాంప్రదాయాలూ, లేకుండా...మామూలుగా భర్త దగ్గరికి ఎందుకు వెళ్ళలేమా?...మాటాడలేమా? అని ఎన్నో అను

కున్నది...నేటివరకూ ఈ ఆడవాళ్ళు చేస్తున్నదంతా, విన్నది నెమరు వేస్తూ చేసే నటన! తలుచుకుంటే మామూలుగానే వుండగలదు అనుకొనేది? కాని తనవరకూ వచ్చేసరికి, అప్రయత్నంగా చూపులు క్రిందికి దిగిపోతున్నవి, కాళ్ళు వెనక్కి లాగుతున్నాయి, శరీరం అంతా అదో విధమయిన, సిగ్గుతో ముడుచుకుపోతూంది! ఇది నిజమా?

తననే చూస్తూ తనకోసమే ఎదురు చూస్తున్న భర్తని తేరి చూడలేక తలదించుకొని, కాలితో నేలరాస్తూ వుండిపోయింది.

అలా పావుఘంట...అరఘంట అయింది...అయింది...అతను రాలేదు!

పొంగుతున్న కోర్కెలు! మత్తెక్కిస్తున్న పరిమళాలు! మైమరపిస్తున్న వాతావరణం! ఉవ్విళ్ళూరుతూన్న యవ్వనం పులకరింతలు తీస్తున్న ఆలోచనలు...పరచివున్న పూలపాన్పు!...అబ్బ! అతనువచ్చి తనను తీసుకుంటే బాగుండుననుకుంది—కాని అతను రాడేం?...తనే వెళ్ళలేదా? తనలో తనకే నవ్వు వచ్చింది!...అరె! తను కాలయినా కదప సాహసించలేక పోతూన్నది? ఇదేమిటి? యుగ యుగాలనుండి మొదటిరాత్రి నాటి స్త్రీత్వమే...ఆ వారసత్వమే తన నరనరాల్లోనూ వుండి ఇలా చేయిస్తూందా? లేదు... తనలో ఏదో తనకు తెలియని శక్తి, బంధాలు వేస్తూంది. అది సహజంగానే వుంది! అంతేగాని క్రొత్తగా ఏంకాదు!

అంతేనా? సృష్టి ఆదినుండి! స్త్రీ మౌనాన్నే వహించడమూ పురుషుడే మొదట ప్రయత్నించడమూనా? మార్పురాదా?...కాని— ఆ మార్పు వస్తేనే అసహజమేమో?

మరయితే తను ఎంత ప్రయత్నించినా తనలో మార్పు రాలేదే? తాను మార్చుకోలేక పోయిందేం?...ఏమిటో ఆ క్రొత్త...ఆ తొలి అనుభవం ఆశ్చర్యంగా వుంది! బహుశా అతనుకూడా యిలాగే సిగ్గుపడుతున్నాడేమో...మగవాళ్ళకి సిగ్గు వుంటుందా? వాళ్ళూ మనలాగే

అయితే ఇంక ఈ సమస్య విడేది ఎప్పుడు? అతని భావాలెలా వున్నాయో?...అని తలపోస్తూ అలా నుంచునే వుండివుయింది గాని తెగించి ముందుకు పోలేదు సీత—

ఇన్నాళ్ళూ స్వప్న వీధుల్లో ఎన్నెన్ని తీయని కలలు కన్నది! ఈ రోజుకోసం! ఎంత పవిత్రంగా ఎదురు చూసింది? ధనవంతుడు ధనం కూడబెట్టి కోటీశ్వరుడౌతాడు! పుణ్యాత్ముడు పుణ్యంచేసి మోక్షం పొందుతాడు అలాగే తనూ, ఈ యవ్వనం, మనస్సు, శరీరం, పవిత్రతా...అంతా ఈ రోజుకోసం, ఈ క్షణంకోసం దాచుకుంది. ఈ సమయంకోసం ఎదురు చూస్తూ పదిలపర్చుకున్నది. తన కాబోయే భర్త కోసం తన సర్వస్వం దోచుకొమ్మని ఇచ్చి తరిద్దామనుకుంది.

అటువంటిది, ఈ రోజు వచ్చింది! భర్త...తను కలలుకన్న భర్త రాడేం?...దగ్గరకు తీసుకోడేం?

ఎంతో ఆశతో అలా నుంచొనే వుంది. అలా ఎంతో సేపయింది. అయినా అతను కదిలి రాలేదు. అంత ఆశలోనూ సీతకి కాళ్ళు పీకడం, మొదలెట్టేయి. ఎంతకని అలా బొమ్మలా నుంచుంటుంది. ఒకసారి తల ఎత్తి చూసింది. అతనూ అలాగే తనవైపు చూస్తున్నాడు! తప్పితే—పోనీ రమ్మని సంజ్ఞ కూడా చేయలేదు!

ఇంక సహించలేకపోయింది సీత, అడుగులో అడుగు వేసు కుంటూ మెల్లగా నడచి మంచం దగ్గర కుర్చీ వుంటే అక్కడకు వెళ్ళి నుంచుంది!

ఆమె దగ్గరకు రావడం చూసి అతనుకూడా కుర్చీ దగ్గరకు వచ్చేడు.

అది చూసి 'శాస్త నయం!' అనుకుని ఆనందించింది సీత! ఇద్దరూ దగ్గిరలో వున్నారు ఒకరి గాలి ఒకరికి తగులుతూన్నది: సీతకు సిగ్గో ఏమో తెలీదుగాని ఎదురుగుండా నిలబడలేక కుర్చీలో కూర్చుండి పోయింది! అతనేమన్నా దగ్గరకు వచ్చి ముట్టుకుంటాడేమో అని ఆశతో

చూసిందిగాని మళ్ళీ అతనిలో చలనంలేదు! అలా నిలబడి వుంటేనే బావుండేది అని అనుకుంది కాని ఎంచేత ధైర్యంగా నిలబడలేక పోయానా? అనిపించింది!

సీతకి ఇంకో ఆశ్చర్యంకూడా వేసింది! అతనికి ఏమీ అనిపించ లేదా? తనని చూసి అతనేమీ అనుకోలేదా? అతనిలో ఏ భావాలూ కలుగ లేదా? ప్రేమ, ఉద్రేకం, తపనా, లేదా? తనతో మాటాడాలని, దగ్గరగా తీసుకోవాలని లేదా? లేక తనలో ఆకర్షణలేదా? ఏదయినా లోపం వుందా?...స్త్రీ గనుక తనకు సిగ్గంటే సహజం? కాని అతనికేం? అతను మగవాడు అతనికి కూడా అంతకంటే సిగ్గా!

ఈ విధంగా సీత ఆలోచించడం మొదలు పెట్టింది. అలా కుర్చీ దగ్గర అరగంట అయింది. ఎక్కా వాళ్ళక్కాడే వుండిపోయారు. తను ఎంత ఆశించిందో అంతా ఇలా జరుగుతోందేమిట...? సీతకు మరో భయం ఏమిటంటే——

వెనక తలుపుదగ్గర సందడిగా వుంది! అమ్మలక్కలు తక్కువ వాళ్ళు కాదు. గోడలకి కళ్ళు చేసేరేమో!...సహజంగా... పోతే భుజాలు ఎగురవేస్తారు లేమూ ఏదయినా విడూరం జరిగితేనే...అ కళ్ళు తెరుచు కుని వీధిలోకి వస్తుంది. అతనికిదేమీ పట్టినట్టులేదు! విగ్రహంలా చూస్తూ నుంచునే వున్నాడు. సీత ఇక వుండబట్టలేకపోయింది!... పోనీ తనొక్కసారి ముందడుగు వేసి చూద్దాం! అని అనుకుని అక్కడ పళ్ళెంలో తమలపాకుల చిలక ఒక దానిని తీసి అతని చేతిలో వుంచింది.

అతడు సరసుడే! చిలకను తీసుకుంటునట్టే చేతినికూడా పట్టు కున్నాడు!... అతను లేవనెత్తలేదు గాని—ఆ అదును తీసుకుని, లేవ నెత్తినట్టే లేచి నుంచుంది సీత అతని దగ్గరగా!

అతని చెయ్యి వణుకుతూంది! సీతకి ఆపాదమస్తకం పులకరించి పోయింది...ఏదో విద్యుత్తు శరీరం అంతా ఒక్కసారి ప్రాకినట్టయింది. కళ్ళు వాటంతటవే బరువెక్కి మూతపడ్డాయి.

కళ్ళు తెరిచేసరికి అతని రెండు చేతులూ ఆమె భుజాలమీద వున్నాయి. సీత పరవశించి హృదయంమీద వాలిపోయింది. క్రింద పడకుండా ఆయనగారు ఆమెను పట్టుకోక తప్పలేదు. మొట్ట మొదట పురుష స్పర్శ ఆమెను ఏదో లోకాలలోకి తీసుకుపోయింది. మంచం దగ్గరగా వుండడంవల్ల ఆమె ఆయనని పట్టుకు వాలిపోయిందో, అతనే ఆమెను పట్టుకు వాలిపోయాడో తెలియడం కష్టం-మొత్తంమీద ఇద్దరూ మంచం మీద కూర్చుండిపోయారు...సీతకు నవ్వు వచ్చినా ఆపుకుంది. ఇష్టం లేకపోయినా లేచి అంతా సర్దుకుని దూరంగా సిగ్గు పడుతున్నట్టు జరిగి కూర్చుంది...అతను దగ్గరగా వచ్చి తీసుకుంటాడనే భ్రమతో—ఆ బెట్టు చేసింది? ఊహూఁ! అతను అలా చేస్తే ఇకనేం? ఆ కూర్చున్నవాడు కూర్చున్నట్టే మిడుతూ, మిడుతూ చూస్తూ కూర్చున్నాడు.

ఛీ! ఎందుకు తొందరపడ్డానా! అని అనుకుంది. ఎంత చేసినా ఇంతే ఇతను కామోసు అని. ఈపాటికి అతని ఒడిలో లాలింపబడుతూ వుండవల్సింది. తను బెట్టు చేస్తుంటే అతను మరీ మరీ చేరదీయవలసింది. సిగ్గు తెరలను అతను తొలగించవలసింది. అంతాపోయి అతనే ఈ విధంగా సిగ్గు పడుతూండడం-సీతకి అర్థం కాలేదు. తెగించి అంత కన్నా విపులంగా తన కోర్కె ఎలా జెప్పగలదు? బొత్తిగా పురషపాత్ర ధరించడానికి ఇది నాటకం కాదుగా. మరి అతని వాలకం చూస్తే అలా వున్నది.

సీతకి లోన కోర్కెలు సముద్ర కెరటాల్లా పొంగి ప్రవహించి వెనక్కి వెళ్ళిపోతున్నాయి. ఒకే ప్రక్కమీద దగ్గరగా వుండి కూడా విడివిడిగా వుండడం! ఒకరి గాలి ఒకరికి సోకుతూండడం దుర్భరంగా వుంది.

అతని మౌనం, సీతకు రోషం కలుగజేస్తూంది. ఈ పాటికి ఎంతో ఆనందంగా, ఒకరి కౌగిలిలో ఒకరు, సుఖాల తీరాలలో గడపవలిసిన కాలం అంతా వృథా అయిపోతూంది.

ఇంక ప్రయోజనం కనబడలేదు. పోనీ అని తనే ముందుగాచొరవ తీసుకున్నా లాభం లేకపోయింది. ఇహ ఆ రాత్రి అంతా అట్లానే జాగార మవుతుందనే నిరాశా పూరితమయిన వూహ వచ్చేసరికి, సీతకు అనుకో కుండా దుఃఖం పొంగిపొరలి వచ్చింది. కళ్ళంట నీళ్ళు తెలియకుండానే, బొటబొట రాలేయి! అప్రయత్నంగా.

ఆ దెబ్బతో ఎదురుగుండా విగ్రహానికి చలనం వచ్చినట్టుంది. ఇంకా ఏమిటో తమాషా చూస్తున్నట్టు చూస్తూ ఈమె కళ్ళంట నీళ్ళు చూసేసరికి గమ్మున లేచాడు. ఆమె దగ్గరకు జరిగి ఆమె ముఖం తన త్రిప్పుకున్నాడు.

"ఏడుస్తున్నావా ఛా! ఎందుకూ?" అని అడిగేడు.

అతను చేతులతో పట్టుకొని అలా సానుభూతి చూపేసరికి... సీతకు దుఃఖం వెల్లువలా ముంచుకొచ్చింది. ఆశ్చర్యం! వెక్కి వెక్కి ఏడవ డం మొదలెట్టింది.

తన పంచ కొంగుతో కంటి నీరు తుడుస్తూ.

"ఇలాటి సమయంలో కంటి నీరా? లే...తుడుచుకో! ఇప్పుడే మన్నానని?" అని అడిగేడు.

సీతకు ఏడవాలో నవ్వాలో తెలియలేదు. అతను ఏమీ అనకపోవ డం చేతనే తను ఏడుస్తున్నదని అతనికి తెలియనందుకు విచారించింది! కాని తనకలా అప్రయత్నంగా ఏడుపు ఎట్లా వచ్చిందో ఆశ్చర్యం కలిగింది అచ్చంగా ఆడదానిలాగే తనూ ప్రవర్తిస్తూందా? లేకపోతే ఇలాటి పనులను విమర్శించిన తను మాత్రం ఏం చేస్తూంది. సిగ్గుపడడం, జవాబు చెప్పకపోవడం, మౌనం...బెట్టు చేయడం...ఏడవడం ఇవన్నీ. కాని ఏదీ...తను చేయాలని చేయలేదే?...అదే ఆశ్చర్యంగా వుంది. అయితే పాతకాలం స్త్రీలూ యిట్లాగే చేసే వారో ఏమో? ఆఖరికి, తిరుగు లేని ఈ అస్త్రం, ఏడుపుకూడా విడిచి, సాధించింది. ఆడదానికి అది దేముడిచ్చిన వరం అంటే నమ్మేది కాదు.

ఇట్లా ఆలోచిస్తూ తల దించుకు జవాబు చెప్పకుండా కూర్చొనే సరికి...ఆమె ఇంకా ఏడుస్తున్నదనే అనుకొని అతను ఇంకా దగ్గరగా జరిగాడు ఓదార్చడానికి.

ఇంతలో కరంటు ఆఫ్ అయిపోయింది కాబోలు...బెడ్‌లైట్ ఆరిపోయి అంతా చీకటయి పోయింది. చీకటిలో సిగ్గు తెరలు తొలగిపోయినాయి. ఆ చీకటికి భయపడినట్టు నటిస్తూ, అదే సమయమని సీత అతనిని గట్టిగా అదుముకుని వుండి పోయింది. ఇద్దరి వూపిరులూ కలిసిపోయినాయి. అతని సిగ్గు—ఆమెకి భయపడి పారిపోయింది. ఆమె సిగ్గు కనబడుస్తూనే ఎంతో సుకుమారంగా, చాకచక్యంగా తన భావాలను ప్రదర్శించింది?

రామకృష్ణ కదే ఆశ్చర్యం కలిగించింది. సీతేగాని సిగ్గులేకుండా పురుష పాత్ర ధరిస్తే ఎట్లా వుండేది?...తనకి ఆజన్మాంతం స్త్రీ అంటే, విరక్తి, అసహ్యం, భయమూ కలిగేదేమో?

తలుపుదగ్గర ముగ్ధ మోహనాకారంతో తలవంచుకు అజంతా శిల్పంలా నిలబడ్డ సీతను చూసినపుడే...పరవశంతో లేచి ఆమెను కౌగిలించి ఎత్తుకుని తీసుకువద్దామా అనుకున్నాడు! కాని...తాను ఇన్నాళ్ళనుండి అనుకున్నదంతా...వృధా అయిపోతుంది. ఈ క్షణంలో కనకనిగ్రహించుకొనక పోయినట్లయితే, తెలుసుకోవటం ఎట్లా అనేకదా వూరుకున్నాడు?

రామకృష్ణకి పాతికేళ్ళుపైనే వుంటాయి. జ్ఞానం వచ్చి—అమ్మాయి అంటే 'ఇది' కలిగినప్పటినుండి—పుస్తక జ్ఞానం ఎక్కువయి పోయింది. ప్రాక్టికల్‌గా ఏ అనుభవం లేక పోయినా, థియరిటికల్‌గా కొన్ని భావాలూ, అనుభవాలూ వున్నాయి. అతడికి—అందులోనూ స్త్రీగురించి పుస్తకాల్లో వ్రాసిన వాటికి సమాధానం దొరకాలంటే-మరి తన భార్యే అన్సరుపేపరు అనుకున్నాడు.

'స్త్రీకి సిగ్గు...తన మనసు బయట పెట్టదు—ఏమీచెప్పదు పురుషుడే ఆమె ప్రవర్తన బట్టి గ్రహించుకుపోవాలి.' అని...ఆనాటి కొక్కోక

శాస్త్రంనుండి...ఈనాటి సచిత్ర కామశాస్త్ర పత్రికలవరకూ వరపడి రాస్తున్నదే అది! ఇదే తెలుసుకోవాలని నిశ్చయించాడు. అవసరమయితే, ఆ అమూల్యమయిన మొదటిరాత్రి అంతాకూడా వృధాగా గడిపి అయినా తాను మాత్రం ఏ చొరవా ముందుగా తీసుకోకూడదని నిర్ణయించుకున్నాడు.

"ఆనాటి స్త్రీ అయితే, విద్యా వివేకమూ లేక, పురుషునిమీదేఅన్ని విధాలా ఆధారపడి బానిసల్లా వుండేవారు కాబట్టి అలా వుండేవారు! కాని ఈనాటి నవనాగరికలయిన స్త్రీలు కలిసి మెలిసి ఎలా తిరుగుతున్నారు? క్లబ్బుల్లోనూ కాలేజీల్లోనూ ఎంత కలివిడిగా మాటాడుతున్నారు? అవసరమయిన ఆ పాతకాలపు సిగ్గుముద్రని త్రోసిపుచ్చి, తమకూ వ్యక్తిత్వం, ప్రత్యేకమయిన కోరికలూ, వున్నాయని నిలబడి ఎలా చెప్పగలుగుతున్నారు? అలాగే—ఇదీ...పురుషులతోపాటు అన్ని హక్కులనూ కావాలంటున్న ఈతరం వాళ్ళు ఈ హక్కును కూడ తీసుకుంటారేమో? చూద్దాం!" అనుకున్నాడు. అందుకే సీత ఎంతసేపలా నిలబడుతుందో చూద్దామని, చూస్తూ వూరుకున్నాడు! ఎవరు గెలిచినట్టు? ఆఖరికి మాచ్ డ్రా అయిందా?

సిగ్గుపడుతూ, బెట్టుచేస్తూనే, వద్దంటూనే, మనసిచ్చే ఆ కిటుకే స్త్రీలలో లేకపోతే స్త్రీ పురుషులమధ్య ఈ తీయని, విడరాని బంధం, మోజు వుండేదికాదేమో? అంచేత సిగ్గులేని స్త్రీ అంటే వూహించుకోలేకపోయాడు. అది స్త్రీకి ప్రత్యేకమయిన హక్కు! అందులో పురుషుడికి వంతులేదు అని తెలుసుకున్నాడు.

ఆంధ్ర పత్రిక 6-9-'68